సాక్షి
అనంతపురం

మంగళవారం । 21 । జనవరి । 2025



చీనీ టన్ను రూ.24 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24 వేలు పలికాయి.



అరటి వ్యర్థం.. ఉపాధి మార్గం

రైతులు వృథాగా పడేసే అరటి బోదెలతో పలు ఉత్పత్తుల తయారీపై లేపాక్షి ఎంపోరియం ఆధ్వర్యంలో శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
35.5°/14.8°

జిల్లా అంతటా సోమవారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

90 బస్సులు..
రూ. 29.27 లక్షల జరిమానా

- ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై ఆర్టీఏ అధికారుల కొరడా



తనిఖీలు చేస్తున్న ఆర్టీఏ అధికారులు

అనంతపురం సెంట్రల్: సంక్రాంతి పండుగ సందర్భంగా చేపట్టిన స్పెషల్‌డ్రైవ్‌లో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై ఆర్టీఏ అధికారులు కొరడా ఝుళిపించారు. మొత్తం 90 బస్సులపై కేసులు నమోదు చేసి రూ. 29,27,500 జరిమానా విధించినట్లు ఉప రవాణా కమిషనర్ వీర్రాజు తెలిపారు. పండుగ రద్దీ సందర్భంగా అధిక ధరలకు బస్ టికెట్లు అమ్మకుండా అడ్డుకట్ట వేసేందుకు స్పెషల్‌డ్రైవ్ చేపట్టినట్లు పేర్కొన్నారు. అధిక ధరలు వసూలు చేసినందుకు మూడు బస్సులపై, రోడ్డు ట్యాక్స్‌లు చెల్లించకుండా రాకపోకలు సాగిస్తున్నందుకు ఐదు బస్సులపై,సరుకు రవాణా, అధిక వేగం, రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు లేకపోవడం తదితర కారణాలతో 82 బస్సులపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించినట్లు వివరించారు.

8న నవోదయ ప్రవేశ పరీక్ష

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయలో 9, 11వ తరగతుల్లో ప్రవేశం కోసం (2025-26 విద్యా సంవత్సరం) దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఫిబ్రవరి 8వ తేదీన పరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతికి ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 1,084 మంది విద్యార్థులు, 11వ తరగతిలో ప్రవేశానికి 1,228 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని ఆయన వెల్లడించారు. 9వ తరగతి ప్రవేశ పరీక్ష కోసం లేపాక్షి నవోదయ విద్యాలయతో పాటు మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే గురుకుల కళాశాలలో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా 11వ తరగతి ప్రవేశ పరీక్ష కోసం హిందూపురంలో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. www.navodaya.in వెబ్‌సైట్ నుంచి విద్యార్థులు అడ్మిట్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

అప్పీలుకు నేడు ఆఖరు



పరుగుపందెంలో పాల్గొన్న అభ్యర్థులు

అనంతపురం: జిల్లాలో కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలకు వివిధ కారణాలతో గైర్హాజరైన అభ్యర్థులు అప్పీలు చేసుకునేందుకు మంగళవారం తుది గడువుగా నిర్దేశించినట్లు జిల్లా ఎస్పీ పి. జగదీష్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా, గత నెల 30 నుంచి కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

హిందూపురంలో నకిలీ నోట్ల కలకలం

హిందూపురం అర్బన్: జిల్లాలో నకిలీ కరెన్సీ నోట్లు కలకలం రేపుతున్నాయి. నెలరోజుల క్రితం బత్తలపల్లిలో ఓ చిరువ్యాపారికి, ఇటీవలే కదిరిలో ఓ గొర్రెల వ్యాపారికి రూ.32 వేల విలువ జేసే రూ.500 నకిలీ నోట్లు అంటగట్టిన వైనం మరవకముందే తాజాగా సోమవారం హిందూపురంలోనూ నకిలీనోట్లు కలకలం సృష్టించాయి. ఓ చిల్లర దుకాణదారుని వద్ద నిత్యావసర సరకులు కొనుగోలు చేసిన వ్యక్తి సోమవారం రూ.500 నోట్లు మూడు ఇచ్చాడు. అయితే వాటిని మరో వ్యక్తికి ఇచ్చే తరుణంలో అవి నకిలీవని గుర్తించిన వ్యాపారి వెంటనే వాటిని చించేశాడు. ఫిర్యాదు చేస్తే విచారణ పేరుతో పోలీసుల నుంచి ఇబ్బందులు వస్తాయన్న భయంతోనే వ్యాపారి నకిలీ నోట్లను చించేసినట్లు తెలుస్తోంది. రోజుకోచోట నకిలీ నోట్లు చేతులు మారుతుండటంతో ఏది నకిలీ.. ఏది అసలో గుర్తించలేక జనం ఆందోళన చెందుతున్నారు. అసలు నోటును పోలిన నకిలీ నోట్లు మార్కెట్‌లో చలామణి చేస్తుండటంతో ప్రతి నోటు చూసి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కోయంబత్తూరు, చెన్నై నుంచే సరఫరా..?

నకిలీ కరెన్సీ నోట్లు తమిళనాడులోని కోయంబత్తూరు, చెన్నైలలో ముద్రించి కర్ణాటక మీదుగా జిల్లాలోకి తీసుకు వస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఎక్కువగా రూ.500 నోట్లే ఉంటున్నాయి. అసలు నోటుకు మూడు నకిలీ నోట్లు ఇవ్వడం, కొందరు అమాయకుల వద్ద నేరుగా మార్చడం చేస్తున్నారు. ప్రధానంగా 9ఎఫ్‌బీ 248053, 2టీపీ 175028 సిరీస్ గల నకిలీ నోట్లు జిల్లాలో బయట పడ్డాయి. జిల్లాలోని కదిరి, హిందూపురం, మడకశిర, ధర్మవరం ప్రాంతాల్లో నకిలీ నోట్ల మారకం చేస్తున్నట్లు తెలుస్తోంది.

పాలకుల పుణ్యమా అని అక్కడ అసాంఘిక కార్యకలాపాలు జడలు విప్పుకున్నాయి. మట్కా రాయుళ్లు రెచ్చిపోతున్నారు. ఇటీవల ఆ ప్రాంతం గంజాయి బ్యాచ్ అడ్డాగా కూడా మారిపోయింది. అధికారులపై బహిరంగంగానే బెదిరింపులకు దిగడం అక్కడ షరామూమూలే. అలాంటి ప్రాంతానికి 'అఖిల భారత సర్వీసు అధికారి'ని ఏఎస్పీగా ప్రభుత్వం నియమించింది. అరాచకాల కట్టడిలో ఆయన ఎంత మాత్రం 'హిట్' అవుతారా అనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.



అరాచకాల కట్టడిలో
రోహిట్ అయ్యేరా?



- ఏఎస్పీ రాకతో 'తాడిపత్రి'లో మారిన వాతావరణం
- అసాంఘిక శక్తుల అప్రమత్తం
- జూదరులు, గంజాయి ముఠా ఆచితూచి అడుగులు
- అధికారి తీరును బట్టి ముందుకెళ్లాలన్న ఆలోచనలో మట్కా బీటర్లు
- పోలీసుల తీరుపై ఇప్పటికే విసుగెత్తిన స్థానికులు
- ఐపీఎస్‌పై బోలెడన్ని ఆశలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: తాడిపత్రి ఏఎస్పీగా నాలుగు రోజుల క్రితమే ఐపీఎస్ అధికారి రోహిత్ కుమార్ చౌదరి బాధ్యతలు స్వీకరించారు. ఏకంగా అఖిల భారత సర్వీసుల అధికారిని ఇక్కడికి కేటాయించడంతో అటు అసాంఘిక శక్తులతో పాటు ఇటు రాజకీయ నాయకులు కూడా ఆచితూచి అడుగులు వేస్తున్నారు. మట్కా, గంజాయికి రాష్ట్రంలోనే కేంద్ర బిందువుగా మారిన తాడిపత్రి నియోజకవర్గంలో కొత్త ఏఎస్పీ రాకతో స్తబ్దత నెలకొన్నట్లు తెలిసింది. మట్కా ఏజెంట్లు, గంజాయి ముఠా, రకరకాల జూదం ఆడేవాళ్లు రెండురోజులుగా గుట్టు చప్పుడు కాకుండా ఉన్నారు. ఎక్కడైనా కొత్త పోలీసు అధికారి వచ్చీ రావడంతోనే అసాంఘిక కార్య కలాపాల కట్టడికి విస్తృతంగా దాడులు చేయడం మామూలే. అందుకే ఏఎస్పీ రాకతో తాడిపత్రిలో జూదరులు, మట్కాబీటర్లు తమ అక్రమ కార్యకలాపాలకు తాత్కాలికంగా విరామం ప్రకటించినట్లు సమాచారం.

ప్రజల్లో భయం భయం..

విచ్చలవిడి మట్కా కార్యకలాపాలతో తాడిపత్రి రెండో ముంబైగా పేరుగాంచింది. ఇక్కడ జూదం మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది. ఇటీవల పట్టణంలో గంజాయి ముఠా ఆగడాలు కూడా ఎక్కువయ్యాయి. మద్యం అక్రమ అమ్మకాలు, దొంగతనాలు, రేప్ కేసులు, హత్యలు పెరిగాయి. టెండర్ల ద్వారా తాడిపత్రిలో నాలుగు మద్యం షాపులు దక్కించుకున్నా.. ఇతర ప్రాంతాల వారు అనే కారణంగా వారికి అద్దెకు భవనాలు కూడా దక్కనివ్వకుండా అడ్డుకున్నారు. మరోవైపు పట్టణ సమీపంలోని పెన్నానదిలో విచ్చలవిడిగా ఇసుక తోడేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. నిత్యం వందల టిప్పర్ల ఇసుకను అక్రమంగా తరలిస్తూ నది స్వరూపాన్నే మార్చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఏమీ తెలియనట్లు మిన్నకుండి పోతుండటంతో పోలీసులపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. అధికార పార్టీకి చెందిన నాయకులు దాడులు చేశారని బాధితులు ఫిర్యాదు చేసినా సీఐలు స్పందించడం లేదనే విమర్శలున్నాయి.

తీవ్రంగా ఒత్తిళ్లు..

తాడిపత్రిలో పని చేసే అధికారులు జేసీ బ్రదర్స్ నుంచి తీవ్రంగా రాజకీయ ఒత్తిళ్లు ఎదుర్కోవాల్సి వస్తోంది. గతంలో గ్రూప్-1 అధికారి అయిన డీఎస్పీ చైతన్య తమకు సహకరించలేదన్న ఉద్దేశంతో జేసీ కుటుంబం ముప్పు తిప్పలు పెట్టి ఆయనను వేరే ప్రాంతానికి బదిలీ చేయించింది. కూటమి సర్కారు వచ్చాక ఇక్కడ ఒక తహసీల్దార్ విధుల్లో చేరేందుకు కూడా భయపడ్డారు. ఇటీవల ఏ తప్పూ లేకుండానే సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డితో ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డికి క్షమాపణలు చెప్పించారు. దీంతో కిందిస్థాయి పోలీసుల్లో ఆత్మస్థైర్యం దెబ్బతింది. ఈ పరిస్థితులను నూతన ఏఎస్పీ రోహిత్ కుమార్ ఎలా ఎదుర్కొంటారనే విషయంపై సందేహాలు నెలకొన్నాయి. ఏదిఏమైనా కొత్త ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరికి తాడిపత్రిలో అనేక సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి. ఇక్కడ ఆయన 'హిట్' అవుతారా లేదా అన్నది వేచి చూడాల్సిందే.

30న జెడ్పీ సమావేశం

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30న నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సోమవారం ఆమోదం తెలిపారు. వాస్తవంగా ఫిబ్రవరి 7న సమావేశం నిర్వహించాలని జెడ్పీ అధికారులు భావించారు. అయితే అదే నెల ఒకటో తేదీ నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమై 13వ తేదీ వరకు కొనసాగనున్నాయి. దీంతో తమ నిర్ణయాన్ని జెడ్పీ అధికారులు మార్చుకుని.. కొత్తతేదీ ఫైల్‌ను చైర్‌పర్సన్‌కు పంపగా ఆమె ఆమోదం తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కో-ఆప్షన్, జెడ్పీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులకు సమాచారం పంపారు. వాట్సాప్‌తో పాటు మెయిల్‌కు సమాచారం పంపినట్లు డిప్యూటీ సీఈఓ జి. వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన సమావేశం ప్రారంభం కానుంది.

శ్రీ సత్యసాయి కలెక్టర్ వస్తారా..?

జెడ్పీ సమావేశాలకు, స్టాండింగ్ కమిటీ సమావేశాలకు శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ డుమ్మా కొడుతున్నారు. మరికొన్ని శాఖల అధికారులు కూడా రావడం లేదు. ఈ అంశంపై సభ్యులు, ప్రజాప్రతినిధులు నిలదీస్తూ వస్తున్నారు. పునర్విభజన తరువాత శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన బసంత్‌కుమార్ మాత్రమే క్రమం తప్పకుండా సమావేశాలకు హాజరయ్యేవారు. ఆ తరువాత వచ్చిన కలెక్టర్లు జెడ్పీ వైపు కన్నెత్తి చూడటం లేదు. ఈ అంశంపై గత సమావేశంలో ప్రజాప్రతినిధులు, సభ్యులు నిలదీశారు. కలెక్టరే లేకుంటే ఇక తామెందుకు రావాలని అసహనం వ్యక్తం చేశారు. కలెక్టర్ రాకుంటే వచ్చే సమావేశాన్ని బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. అయితే అనంతపురం కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ కలగజేసుకొని వచ్చే సమావేశానికి కచ్చితంగా ఆయన వచ్చేలా చూస్తానని పేర్కొన్నారు. ఈ క్రమంలో త్వరలో జరగబోయే సమావేశానికైనా శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ వస్తారా లేదా చూడాలి.

పరిశీలన మాటున పిడుగు!

- పింఛన్ల తొలగింపునకు చంద్రబాబు సర్కారు కుట్రలు
- జిల్లా వ్యాప్తంగా 'అనారోగ్య పెన్షన్' లబ్ధిదారులకు పరీక్షలు
- కోత వేసేందుకే కుయుక్తులు పన్నుతున్నారని సర్వత్రా విమర్శలు
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న పేదలు



గుమ్మఘట్టలో ఇళ్లవద్దే నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

రాయదుర్గం: దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ మంచానికే పరిమితమైన వారిపై చంద్రబాబు సర్కారు కత్తి కట్టింది. పింఛన్ల తొలగింపునకు వైద్యులు, సిబ్బందిని రంగంలోకి దించింది. జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారుల పరిశీలన ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. వచ్చే నెల ఫిబ్రవరి వరకూ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

కోత పెట్టేందుకే..

అనర్హుల ఏరివేత ముసుగులో భారీగా కోత పెట్టేందుకు కూటమి సర్కారు కుట్రలు పన్నుతోందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటిదాకా ఏ ఆటంకం లేకుండా పింఛన్ అందుకుంటున్న వారిలో ఆందోళన మొదలైంది. ఇళ్ల వద్దకు వెళ్తున్న సిబ్బంది అక్కడికక్కడే వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. వైకల్య ధ్రువీకరణ పత్రాలు కొత్తగా పరిశీలిస్తున్నారు. ఇప్పటి దాకా జరిగిన సర్వేలో కొన్ని లోటుపాట్లు గుర్తించినట్లు తెలిసింది. దీంతో తమ పింఛన్లు ఉంటాయో? ఊడతాయో? అన్న భయంతో పేదలు వణికిపోతున్నారు. ఇన్నాళ్లు వైద్య ఖర్చులకు భయం లేకుండా పోయిందని, పింఛన్లు తొలగిస్తే రోడ్డున పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో 'దీర్ఘాయుష్మాన్‌భవ' అంటూ..

దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతూ మంచానికి పరిమితమైన వారందరికీ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. దేశంలో ఎక్కడా లేని విధంగా వైద్య ఖర్చులు, జీవనానికి సరిపడా మొత్తాన్ని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారు. ఠంఛన్‌గా ఒకటో తేదీన ఇళ్లవద్దే సొమ్ము పంపిణీ చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం పింఛన్లకు కోతపెట్టేలా కుట్రలు చేస్తుండటంతో లబ్ధిదారులు, ప్రజాసంఘాలు, ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. అర్హులకు ఏమాత్రం అన్యాయం జరిగినా రోడ్డెక్కాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాయి.

జిల్లాలో పింఛనుదారుల వివరాలు

మొత్తం పింఛన్లు	2,54,085
రూ.15 వేలు పొందుతున్న వారు	2,499
రూ.10 వేలు పొందేవారు	691
రూ.6 వేలు పొందే దివ్యాంగులు	45,820

ఆందోళన అవసరం లేదు

దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ మంచానికే పరిమితమైన వారందరినీ వైద్యులు, సిబ్బంది పరిశీలిస్తారు. తాజా స్థితిగతులను అంచనా వేస్తారు. వైకల్య ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తారు. దీనిపై ఎలాంటి ఆందోళన అవసరం లేదు. అర్హత కలిగిన వారి పింఛన్లు ఏ ఒక్కటి తొలగించే అవకాశం లేదు. పరీక్షల కోసం ఇళ్ల వద్దకు వచ్చే వైద్యులు, సిబ్బందికి పింఛనుదారులు సహకరించాలి.

– ఈశ్వరయ్య, డీఆర్‌డీఏ పీడీ

'యంగ్ ఇండియా' బేడీ ఇక లేరు

వయోభారంతో కన్నుమూసిన గ్రామీణ ఉపాధి హామీ హక్కుల ఉద్యమకారుడు



నరేంద్ర సింగ్ బేడీ (ఫైల్)

పెనుకొండ రూరల్: యంగ్‌ఇండియా ప్రాజెక్టును స్థాపించి..ఉమ్మడి అనంతపురం జిల్లాలో గ్రామీణ ఉపాధి హామీ హక్కుల కోసం ఉద్యమించిన నరేంద్ర సింగ్ బేడీ (86) ఇకలేరు. వయో భారంతో సోమవారం ఉదయం శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం గుట్టూరు సమీపంలోని యంగ్ ఇండియా ఫారంలోని తన నివాసంలో కన్నుమూశారు. బేడీ 1939 సంవత్సరంలో కోల్‌కతాలో జన్మించారు. అమెరికాలో కెమికల్ ఇంజినీరింగ్ చదివి.. కొంత కాలం అక్కడే ఉద్యోగం చేశారు. 1969లో స్వదేశానికి తిరిగొచ్చారు. 1975-76 మధ్య కాలంలో ఉమ్మడి అనంతపురం జిల్లా పెనుకొండకు వచ్చారు. పెనుకొండ మండలం గుట్టూరు వద్ద 44వ జాతీయ రహదారికి సమీపంలో యంగ్ ఇండియా ప్రాజెక్టు కార్యాలయాన్ని ప్రారంభించారు. తీవ్ర కరువు, పేదరికంతో జిల్లా కొట్టుమిట్టాడుతున్న ఆ రోజుల్లో రైతులు, గ్రామీణ శ్రామికులు, పేదల హక్కుల కోసం ఉద్యమించారు. భూ పోరాటాలతో పాటు ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. యంగ్ ఇండియా ద్వారా ఈ ప్రాంత అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు కృషి చేశారు. రైతు సహకార, వ్యవసాయ కూలీల, మహిళా సంఘాలను ఏర్పాటు చేసి..ఆయా వర్గాలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వృద్ధిలోకి వచ్చేలా చైతన్య పరిచారు. దివ్యాంగులకు చేయూతనిచ్చారు.

ఉపాధి హామీ కోసం ఉద్యమం

పేదల అభివృద్ధికి ప్రభుత్వాల చేయూత కావాలనే సంకల్పంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కోసం నరేంద్ర సింగ్ బేడీ ఉద్యమించారు. గుట్టూరు నుంచి సంస్థ సభ్యులతో కలసి ఢిల్లీ వరకు సైకిల్ యాత్ర చేపట్టి అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీకి వినతి పత్రం ఇచ్చారు. అలాగే లక్ష సంతకాలు సేకరించి.. సైకిల్ ర్యాలీగా వెళ్లి అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో అప్పటి కేంద్ర కార్మిక శాఖ మంత్రి గుడిసెల రామస్వామికి వినతి పత్రం అందజేశారు. అలాగే చుండూరులో దళితులపై దాడులు, మారణహోమాన్ని ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా దళిత, గిరిజనులను చైతన్య పరిచారు. 1983లో భూ పోరాటాల్లో పాలుపంచుకున్నారు. నరేంద్ర సింగ్ బేడీ.. మణిశంకర్ అయ్యర్, దిగ్విజయ్ సింగ్, ఎంఎస్ స్వామినాథన్ లాంటి ప్రముఖులకు సమకాలికులు. మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ..బేడీకి మూడేళ్ల జూనియర్. ఈయనకు భార్య సోనియాబేడీ, కుమారులు రాజీవ్, సంజయ్, కుమార్తె తారా ఉన్నారు.

నేడు అంత్యక్రియలు

బేడీ అంత్యక్రియలు మంగళవారం గుట్టూరు సమీపంలోని యంగ్ ఇండియా ప్రాజెక్ట్ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎస్సీ ఉపకులాల వివరాలు సిద్ధం చేయండి

- అధికారులకు ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఆదేశం
- ఎస్సీ సంఘాల ప్రతినిధుల నుంచి 237 వినతుల స్వీకరణ



అధికారులతో మాట్లాడుతున్న ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా. చిత్రంలో కలెక్టర్లు వినోద్‌కుమార్, చేతన్, ఎస్పీ జగదీష్ తదితరులు



హాజరైన అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల ఉన్నతాధికారులు

అనంతపురం అర్బన్/ఎడ్యుకేషన్/బుక్కరాయసముద్రం/గుంతకల్లుటౌన్/గార్లదిన్నె: ఎస్సీ ఉపకులాల వారీగా సమగ్ర వివరాలతో నివేదికలు సిద్ధం చేయాలని ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో అనంతపురం జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్, ఎస్పీ పి.జగదీష్‌తో కలిసి అధికారులతో సమీక్షించారు. ఉమ్మడి జిల్లాలో ఎస్సీల జనాభా తదితర వివరాలను కమిషన్ చైర్మన్‌కు కలెక్టర్ వినోద్ కుమార్ వివరించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లా జనాభా 40.81 లక్షలు కాగా, ఇందులో ఎస్సీల్లో 48 ఉపకులాలకు సంబంధించి జనాభా 5.83 లక్షలు (14.29 శాతం) ఉందని పేర్కొన్నారు. మాదిగ సామాజికవర్గానికి చెందిన వారు 4,75,632 మంది, మాల సామాజిక వర్గానికి చెందిన వారు 73,525 మంది, మిగిలిన ఉపకులాలకు చెందిన వారు 33,843 మంది ఉన్నారని చెప్పారు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, 4, క్లాస్-4, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు 48,080 మంది ఉన్నారన్నారు. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, వైద్య, పారామెడికల్, నర్సింగ్, ఇంజినీరింగ్ తదితర విద్యనభ్యసిస్తున్న ఎస్సీ, ఉపకులాలకు చెందిన విద్యార్థులు 4,15,677 మంది ఉన్నట్లు వివరించారు. మునిసిపల్, హౌసింగ్, మెప్మా, డీఆర్‌డీఏ బ్యాంక్ లింకేజీ, ఉపాధి హామీ తదితర పథకాల ద్వారా లబ్ధిపొందిన ఎస్సీ, ఉపకులాల వారి వివరాలను తెలియజేశారు.

కచ్చితమైన వివరాలు అందించాలి

ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా మాట్లాడుతూ ఎస్సీ, ఉప కులాలకు సంబంధించి కచ్చితమైన వివరాలను సేకరించాలని ఆదేశించారు. వివరాల సేకరణలో తప్పిదాలు చోటు చేసుకుంటే న్యాయపరమైన సమస్యలు వస్తాయని, దీన్ని దృష్టిలో ఉంచుకుని పకడ్బందీగా పనిచేయాలని చెప్పారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్ఓ ఎ.మలోల, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ సంఘాల నుంచి 237 వినతులు

ఏకసభ్య కమిషన్ చైర్మన్‌కు ఎమ్మార్పీఎస్, మాల మహానాడు, మాల మహాసభ, ఎస్సీ కులాల జేఏసీ, జంగం హక్కుల పోరాట సమితి, ఇతర సంఘాల నాయకులు, ప్రతినిధులు, ఉద్యోగుల నుంచి 237 వినతులు అందాయి.

- కూటమి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీలపై దౌర్జన్యాలు పెరిగి పోయాయని వైఎస్సార్ సీపీ శింగనమల నియోజకవర్గ ఎస్సీసెల్ నాయకులు వరికూటి కాటమయ్య ఏక సభ్య కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే చైర్మన్ స్పందిస్తూ... ఈ నెల 31న నియోజకవర్గంలోని వెంకటాపురం గ్రామంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించి, సమస్యలు పరిష్కరించాలని జిల్లా అధికార యంత్రాంగానికి సూచించారు.
- ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేసి విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వెనుకబడిన మాదిగ, ఉప కులాలకు న్యాయం చేయాలని రాజీవ్ రంజన్ మిశ్రాను పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, గృహ నిర్మాణాలు, భూమి కొనుగోలు పథకం, స్కిల్ డెవలప్‌మెంట్, ఉద్యోగ నియామకాల్లోనూ కర్షకులు, కార్మికులకు ఎలాంటి లబ్ధి జరగలేదన్నారు. వర్గీకరణ జరిగితేనే ఉపకులాలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.
- ఎస్సీ జాబితా నుంచి మాలలను తొలగించి జనరల్ కేటగిరీలో కలపాలని ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జ్ మీనుగ గోపాల్ కోరారు.
- రిజర్వేషన్ అమలులో ఎస్సీ ఉప కులాలకు సమన్యాయం చేయాలని ఎస్సీ,ఎస్టీ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు కుళ్లాయప్ప కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు విన్నవించారు. ఉమ్మడి రిజర్వేషన్ విధానం వల్ల మాదిగ సామాజికవర్గం నష్టపోతోందన్నారు. అలాగే విద్య,ఉద్యోగ, రాజకీయ అవకాశాల్లో దామాషా ప్రకారం రావాల్సిన విద్యార్థుల సీట్లు, ఉద్యోగాలు పొందలేకపోతున్నారని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు.

గ్రామాల్లో పర్యటన



కొత్తపల్లిలో దళిత రైతులతో మాట్లాడుతున్న రాజీవ్ రంజన్ మిశ్రా

రాప్తాడు రూరల్/బుక్కరాయసముద్రం: అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లితో పాటు బుక్కరాయసముద్రం మండల పరిధిలోని పి.కొత్తపల్లి గ్రామంలో ఎస్సీ కులాల వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా సోమవారం పర్యటించారు. ఎస్సీ రైతులు కాశయ్య, బాబయ్య చీనీ పంటలను పరిశీలించారు. దళిత రైతు కుటుంబాల ఆర్థిక పరిస్థితులపై ఆరా తీశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉప్పరపల్లిలో గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం వ్యవస్థను పరిశీలించారు. ఈ క్రాప్, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల పంపిణీ తదితర కార్యక్రమాలు చేపడుతున్నామని ఎస్‌హెచ్‌ఓ ఆయనకు వివరించారు. చైర్మన్ వెంట కలెక్టర్ వినోద్‌కుమార్,అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, హార్టికల్చర్ డీడీ నరసింహారావు, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, డ్వామా పీడీ సలీమ్‌బాషా తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

అర్జీలకు సంతృప్తికర పరిష్కారం చూపండి

- అధికారులకు జేసీ ఆదేశం
- పరిష్కార వేదికకు 98 వినతులు


వినతులను పరిశీలిస్తున్న జేసీ శివ్‌నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: ప్రజల నుంచి అందే అర్జీలకు సంతృప్తికర పరిష్కారం చూపాలని జిల్లా అధికారులను జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 98 వినతులు అందాయి. వాస్తవానికి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినా... కొందరు ప్రజలు తరలిరావడంతో మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అప్పటికప్పుడు అధికారులతో కలసి అర్జీలను జేసీ స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. కార్యక్రమం అనంతరం అధికారులతో ఆయన మాట్లాడుతూ... అర్జీల పరిష్కారంలో బాధ్యత కనిపించాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపించడంతో పాటు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పురాతన వస్తువుల ప్రదర్శన రేపు

గుంతకల్లు: ఈ నెల 22న స్థానిక రైల్వే కమ్యూనిటీ హాల్‌లో పురాతన వస్తువులు ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు రాయలసీమ న్యూమిస్మాటిక్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు బీజీఆర్ గుప్త, ఎల్ఎం ఫెర్నాండేజ్, కోశాధికారి పి.శివప్రసాద్ సోమవారం ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ప్రదర్శన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డీఆర్ఎం సీఎస్ గుప్త, ఏడీఆర్ఎం యు.సుధాకర్ హాజరుకానున్నారు. ఈ నెల 24వ తేదీ వరకూ మూడు రోజుల పాటు రోజు ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రదర్శన ఉంటుంది. ద్వాపర యుగం నాటి నాణెలు, వస్తువులు, దేశవిదేశీ నాణెలు, కరెన్సీతో పాటు స్టాంప్‌లు, రైల్వే అనుబంధ వస్తువులు ప్రదర్శనకు ఉంచనున్నారు.

జూదరుల అరెస్ట్


పట్టుబడిన జూదరులను చూపుతున్న పోలీసులు

యాడికి: మండలంలోని గుడిపాడు సమీపంలో సోమవారం పేకాట ఆడుతూ 8 మంది పట్టుపడినట్లు సీఐ ఈరన్న తెలిపారు. గ్రామ సమీపంలో కొంత కాలంగా పేకాట జోరుగా సాగుతున్నట్లుగా అందిన సమాచారంతో సోమవారం తనిఖీలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా పట్టుపడిన 8 మంది నుంచి రూ.24,200 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. జూదరులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు పేర్కొన్నారు.



చెవి రింగులు, గాజులు, బుట్టలు, ప్లేట్లు, గ్లాసులు, పాదరక్షలు, డోర్ మ్యాట్లు, యోగా మ్యాట్లు, శానిటరీ న్యాప్కిన్లు, పేపర్, హ్యాండ్ బ్యాగ్‌లు, పూల బుట్టలు, చీరలు ఇలా చెప్పుకుంటూ పోతే ఒకట్రెండు కాదు... ఏకంగా 25 రకాల ఉత్పత్తులు అరటి నుంచి వచ్చినవే. మీరు చదివింది నిజమే. ఇవన్నీ అరటి నుంచి తయారు చేసినవే. అరటి చెట్టు వ్యర్థాలతో ప్రయోజనాలు ఉన్నాయని చెప్పడమే కాదు... ఆసక్తి ఉన్న మహిళలకు శిక్షణ ఇస్తూ అరటి వ్యర్థాన్ని ఉపాధి మార్గంగా ఎంచుకున్న వారికి బాసటగా నిలుస్తోంది జిల్లాలోని లేపాక్షి ఎంపోరియం.



అరటి వ్యర్థం... ఉపాధి మార్గం

- అరటి నుండి అందమైన ఉత్పత్తులు
- హస్తకళలకు లేపాక్షి ఎంపోరియం బాసట


అరటి నారను వేరు చేస్తున్న మహిళలు

అనంతపురం కల్చరల్: ఉమ్మడి జిల్లాలో అరటి సాగు చేసే రైతుల సంఖ్య ఎక్కువగా ఉంది. అయితే అరటి గెలలను మార్కెటింగ్ చేసిన తర్వాత ఆ చెట్లను కొట్టేసి పడేయడం తప్ప రైతులకు మరో అవకాశం లేదు. ఎందుకంటే ప్రతి అరటి చెట్టు తన జీవితకాలంలో ఒక్కసారి మాత్రమే దిగుబడి ఇస్తుంది. ఆ తరువాత అది వ్యర్థంగా మారుతుంది. ఈ నేపథ్యంలో ఆ చెత్తను తొలగించడం కూడా రైతులకు పెద్ద సమస్యగానే ఉంటోంది. రైతులు వృథాగా పడేసే అరటి బోదెలతో పలు రకాల ఉప ఉత్పత్తులు తయారు చేయవచ్చని నిరూపించడమే కాకుండా వాటి తయారీలో పలువురికి శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

'ఒక జిల్లా – ఒక క్రాఫ్టు'తో వెలుగులోకి

జిల్లా విభజన అనంతరం 'అనంత'కు మరో ప్రత్యేక గుర్తింపు దక్కింది. జిల్లాలో 10 వేల హెక్టార్లలో అరటి సాగులో ఉండడంతో కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన వన్ డిస్ట్రిక్- వన్ క్రాఫ్ట్ కింద 'బనానా ఫైబర్' (అరటి నార)తో అందమైన గృహోపకరణాల తయారీని అనంతపురం జిల్లాకు కేటాయించింది. ఈ ఉత్పత్తులకు లేపాక్షి హస్తకళల సంస్థ అన్ని ప్రాంతాల్లో విస్తృత ప్రచారం కల్పించడమే కాక అదే స్థాయిలో విక్రయాలను ప్రోత్సహిస్తోంది. అరటి బెరడు నార తీసి దానితో ఎన్నో వస్తువులను తయారు చేయగల నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కూడేరు, అనంత నగర శివారులో ప్రత్యేక శిక్షణ కేంద్రాలను నెలకొల్పారు. అరటి వ్యర్థాల నుంచి కళాత్మక వస్తువుల తయారీపై వైఎస్సార్ జిల్లా కడపకు చెందిన 'మూసా ఫైబ్రల్' సహకారంతో శిక్షణ అందజేస్తున్నారు.


అరటి నారతో చేసిన చీర

మంచి పేరు వచ్చింది



మూసా ఫైబ్రల్ అందించిన శిక్షణ, లేపాక్షి హస్తకళల వారి సహకారంతో అరటి వ్యర్థం నుంచి అనేక రకాల వస్తువులను తయారు చేయడం నేర్చుకున్నా. నాతో పాటు చాలా మంది శిక్షణ పొందారు. మాలోని సృజనను జోడించి చేస్తున్న బుట్టలు, హ్యాంగింగ్స్‌కు ఎంతో మంచి పేరు వచ్చింది. – జమీలా, కురుగుంట, అనంతపురం రూరల్ మండలం

రెండు నెలల శిక్షణ



అనంతపురం, పులివెందుల, కడపను ఓ యూనిట్‌గా తీసుకుని ఆయా ప్రాంతాల్లో ఔత్సాహిక మహిళలకు అరటి వ్యర్థంతో వస్తువుల తయారీపై శిక్షణ ఇస్తున్నాం. గత ఏడాది ఆగస్టు నుంచి కురుకుంట వద్ద శిక్షణ మొదలు పెట్టాం. రెండు నెలల పాటు శిక్షణ ఉంటుంది. – శ్రీనివాస్, ఎండీ, మూసా ఫైబ్రల్, కడప

హస్తకళలను ప్రోత్సహించాలి



దేశ ఔన్నత్యాన్ని చాటే సంప్రదాయ హస్తకళలకు లేపాక్షి ఎంపోరియం ఎంతో ప్రాచుర్యం కల్పిస్తోంది. ప్రస్తుతం అరటి ఉపఉత్పత్తులనూ ప్రోత్సహిస్తున్నాం. ఆసక్తి ఉన్న వారికి బాసటగా ఎంపోరియం నిలుస్తోంది. – శ్రీనివాసులు, మేనేజర్, లేపాక్షి ఎంపోరియం, అనంతపురం

వైద్య కళాశాలకు దేహదానం


మృతుడు శంకర్‌రెడ్డి

అనంతపురం మెడికల్: అనారోగ్యంతో మృతి చెందిన తన భర్త మృతదేహాన్ని వైద్య విద్యార్థుల ప్రయోగాలకు ఆయన సతీమణి అందజేశారు. వివరాలు... అనంతపురం రూరల్ పరిధిలోని కట్టకిందపల్లికి చెందిన నీలం శంకర్‌రెడ్డి (60), లక్ష్మి దంపతులకు సంతానం లేరు. ఈ నెల 8న అనారోగ్యంతో బాధపడుతున్న శంకర్‌రెడ్డిని సర్వజనాస్పత్రికి లక్ష్మి పిలుచుకొచ్చింది. చికిత్సకు స్పందించక ఈ నెల 19న ఆయన మృతి చెందారు. దీంతో సోమవారం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్న లక్ష్మిని సాయి సంస్థ ప్రతినిధులు కలసి దేహదానం ఆవశ్యకతపై చైతన్య పరిచారు. బాధలో ఉన్న లక్ష్మి గొప్ప మనసుతో అంగీకారం తెలపడంతో సోమవారం ఉదయం సాయిసంస్థ ప్రతినిధుల సమక్షంలో శంకర్‌రెడ్డి పార్థివదేహాన్ని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. మృతుని భార్య లక్ష్మి, సాయి సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫోరెన్సిక్ హెచ్ఓడీ డాక్టర్ శంకర్‌నాయక్, అనాటమీ విభాగాధిపతి డాక్టర్ ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి


ఆపరేషన్ థియేటర్‌లో అనిల్ మృతదేహం

అనంతపురం: నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్న యువకుడు సోమవారం అనుమానాస్పద స్థితి మృతి చెంది కనిపించాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామానికి చెందిన అనిల్ (28) అనంతపురంలోని సాయినగర్‌లో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకూ విధులు నిర్వర్తించాల్సి ఉంది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 9 గంటలకు విధులకు హాజరయ్యాడు. రాత్రి ఇంటికి వెళ్లలేదు. సోమవారం ఉదయం ఆపరేషన్ థియేటర్ తలుపు తీయగానే కుర్చీలో విగతజీవిగా కనిపించాడు. సమాచారం అందుకున్న అనిల్ భార్య భారతి ఆస్పత్రికి చేరుకుని భర్త మృతదేహాన్ని చూసి బోరున విలపించింది. ఘటనపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంలో ఆ దిశగా రెండో పట్టణ సీఐ శ్రీకాంత్ యాదవ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పోలీసుల అదుపులో నకిలీ బంగారం ముఠా సభ్యులు?

సోమందేపల్లి: నకిలీ బంగారం అమ్మేందుకు ప్రయత్నిస్తున్న ముఠా సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆదివారం రాత్రి సోమందేపల్లి మండలం పందిపర్తి గ్రామ సమీపంలో ఎనిమిది మంది బంగారం అమ్మడానికి ప్రయత్నం చేస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.15 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పట్టుబడిన వారిని పెనుకొండ పీఎస్‌కు తరలించి విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

వందేళ్ల తర్వాత ఊరి దేవర

- బొమ్మనహాళ్‌లో నేటి నుంచి నిర్వహణ


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు

బొమ్మనహాళ్: దాదాపు వందేళ్ల తర్వాత బొమ్మనహాళ్‌లో ఊరి దేవర నిర్వహిస్తుండడంతో గ్రామంలో సందడి నెలకొంది. పాడి పంటలు వెల్లివిరాయలని, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ ఈ నెల 21 నుంచి రెండు రోజుల పాటు ఊరి దేవర నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ దేవత దేవమ్మ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఊరి దేవర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గంగపూజ, గోపూజ, 108 కలశాలతో అమ్మవారి విగ్రహానికి అభిషేకం, పడి బియ్యం సమర్పణ, ఆకు పూజ, దుర్గా హోమం ఉంటాయి. రాత్రి 9 నుంచి 10 గంటల వరకు మేటి కుంభాల ఊరేగింపు ఉంటుంది. 22న బుధవారం వేకువజాము 2.30 గంటల మధ్య దేవర పోతును బలి ఇవ్వనున్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఇళ్ల వద్ద విందు కార్యక్రమాలు ఉంటాయి. కాగా, ఊరి దేవర ఉసందర్భంగా ట్రాఫిక్ సమస్య నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. నేమకల్లు క్రాస్ వద్ద ట్రాఫిక్‌ను మళ్లించామన్నారు. బళ్లారి నుంచి కళ్యాణదుర్గానికి వెళ్లే భారీ వాహనాలు డి.హీరేహాళ్, రాయదుర్గం మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకున్నామన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

రాయదుర్గం: మండలంలోని చదం గ్రామంలో దాయాదుల మధ్య భూ వివాదం కారణంగా చోటు చేసుకున్న దాడుల్లో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ హెచ్.గంగాధర్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న శివ, వంశి, సూర్యను గత ఏడాది డిసెంబర్ 16న పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. అజ్ఞాతంలో ఉన్న చిన్న గంగప్పను సోమవారం ఉదయం మల్లాపురం ఆర్చ్ వద్ద సీఐ జయనాయక్ అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం కేసునమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

కోడిగుడ్డు కూర తిని... నగదు దోచేసి!

గార్లదిన్నె: తాళం వేసిన ఇంట్లోకి చొరబడిన దుండగులు... వండిపెట్టిన కోడి గుడ్డు కూర తిని, నింపాదిగా సిగరెట్లు కాల్చి ఆ తర్వాత ఇల్లు దోచేశారు. గార్లదిన్నె మండలం ఇల్లూరు గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు... ఇల్లూరులో నివాసముంటున్న రఘు కూరగాయల వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయనకు రెండిళ్లు ఉండగా... ఆదివారం రాత్రి ఓ ఇంటికి తాళం వేసి, మరో ఇంట్లో భార్యతో కలసి నిద్రించాడు. విషయాన్ని గమనించిన దుండగులు ఇంటి తాళం బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. వంటగదిలో మిగిలిన కోడి గుడ్డు కూరను కడుపార ఆరగించారు. అక్కడే భుక్తాయాసం తీర్చుకుంటూ సిగరెట్లు కాల్చారు. అనంతరం బీరువాలోని రూ.3వేలను అపహరించుకెళ్లారు. కాగా, చిన్నమొత్తం కావడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలిసింది.

మరో ఇంట్లో...



రఘు ఇంట్లో చోరీ చేసే ముందు అక్కడికి సమీపంలోనే నివాసముంటున్న గౌరి ఇంట్లోకి దుండగులు చొరబడ్డారు. రేకుల షెడ్డులో నివాసముంటున్న ఆమె కుట్టు పనితో జీవనం సాగిస్తోంది. రోజులాగే ఆదివారం రాత్రి భోజనం ముగించుకున్న అనంతరం ఇంటికి తాళం తన పిల్లలతో కలసి పుట్టింట్లో తల్లి వద్ద నిద్రించింది. ఇదే అదునుగా భావించిన దుండగులు రేకుల షెడ్డు తాళం బద్దలు గొట్టి బీరువాలోని బంగారు నెక్లెష్, రెండు జతల కమ్మలు, రూ.10 వేలు నగదు అపహరించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ గౌస్ మహమ్మద్‌బాషా అక్కడకు చేరుకుని గౌరి ఇంటిని పరిశీలించారు. క్లూస్ టీంను రంగంలో దించి నిందితుల వేలి ముద్రలను సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

'పోలీసు స్పందన'కు 114 వినతులు


వినతులు స్వీకరిస్తున్న కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు

అనంతపురం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై మొత్తం 114 వినతులు అందాయి. కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు.

రెండు ఆటోలు ఢీ - ముగ్గురికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన రఘురాం, రాజశేఖర్

గుత్తి: స్థానిక తాడిపత్రి మార్గంలో ఆదివారం రాత్రి రెండు ఆటోలు ఢీ కొన్నాయి. ప్రమాదంలో ఆటో డ్రైవర్ మహేష్‌తో పాటు రఘురాం, రాజశేఖర్ తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళుతున్న వారు గమనించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్య

మడకశిర రూరల్: మండలంలోని కల్లుమర్రి గ్రామానికి చెందిన రామాంజప్ప (50) ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానికి బానిసైన ఆయన మద్యం కొనుగోలుకు డబ్బు కావాలంటూ తరచూ కుటుంబసభ్యులను వేధించేవాడు. సోమవారం మద్యం కొనుగోలుకు తనకు డబ్బులివ్వాలంటూ వేధించాడు. తమ వద్ద డబ్బు లేదని భార్య తెలపడంతో పాతశాల ఆవరణలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


వివాహిత ఆత్మహత్య


మృతురాలు యాస్మిన్

అనంతపురం: కుటుంబ కలహాల నేపథ్యంలో క్షణికావేశానికి లోనై ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని పాతూరు వినాయక్ నగర్‌లో నివాసముంటున్న శ్రీనివాసులు, యాస్మిన్ (32) ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇద్దరు కుమారులు ఉన్నారు. జీవనోపాధి కోసం ప్రైవేట్ ట్రావెల్స్‌ను శ్రీనివాసులు ఏర్పాటు చేసుకుని సుమోలు, కార్లు అద్దెకు తిప్పేవాడు. ఈ క్రమంలో వ్యాపారానికి ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేశాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో అప్పులకు వడ్డీల భారం పెరిగింది. ఈ క్రమంలో తరచూ వడ్డీ వ్యాపారులు ఇంటి వద్దకు వచ్చి గొడవ పడుతుండడంతో దంపతుల మధ్య మనస్పర్థలు చెలరేగాయి. దీంతో క్షణికావేశానికి లోనైన యాస్మిన్ ఈ నెల 15న విషపూరిత ద్రావకం తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటి నుంచి అపస్మారక స్థితిలో ఉన్న ఆమె చికిత్సకు స్పందించక సోమవారం మృతి చెందింది. ఘటనపై వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గంజాయి ముఠా అరెస్టు


- రూ.1.5 లక్షల విలువైన గంజాయి స్వాధీనం



మాట్లాడుతున్న కదిరి డీఎస్పీ శివ నారాయణస్వామి, పట్టుబడిన గంజాయి

కదిరి టౌన్: గంజాయి రవాణా చేసే 9 మంది సభ్యులుగల ముఠాను ఎన్‌పీకుంట పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి నుంచి 5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ శివనారాయణ స్వామి కదిరి రూరల్ పోలీసు స్టేషన్‌లో విలేకరులకు వివరించారు. చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన బాలాజీ అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన అర్జున్ నుంచి గంజాయి కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు గంజాయి సరఫరా చేస్తుంటారు. ఇందుకోసం 8 మందితో ఓ ముఠా ఏర్పాటు చేశాడు. ఇందులో భాగంగా సోమవారం గంజాయి ముఠా సభ్యులు ఎన్‌పీకుంట మండలానికి గంజాయి రవాణా చేస్తుండగా... ఎన్‌పీకుంట ఎస్ఐ గోపి తన సిబ్బందితో కలిసి వలపన్ని బాలాజీతో పాటూ మరో ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.1.5 లక్షలు విలువ చేసే 5 గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను కోర్టు ఎదుట హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

చిన్న పోస్టులు.. పెద్ద ఒత్తిళ్లు

- కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో 67 పోస్టులు భర్తీ చేస్తూ ఉత్తర్వులు
- 8న విధుల్లో చేరాలంటూ 'సమగ్ర' అధికారుల సూచనలు
- ఏ ఒక్కచోటా చేర్చుకోని ఎస్ఓలు, మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు


ORDER:
అసిస్టెంట్ కుక్‌గా ఎంపికైన అంజినమ్మకు అందజేసిన నియామక ఉత్తర్వు

అనంతపురం ఎడ్యుకేషన్: అధికార పార్టీ ప్రజాప్రతినిధులు చివరకు స్వీపరు, స్కావెంజర్, కుక్ పోస్టులను వదలడం లేదు. తాము చెప్పిన వారికే ఇవ్వాలంటూ అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు చేస్తున్నారు. ఈ కారణంగా రెండు వారాల కిందట నియామక ఉత్తర్వులు పొందినా నేటికీ విధుల్లో చేర్చుకోకపోవడం దుమారం రేపుతోంది. పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ పోస్టులకు ఎంపికైన వారందరూ దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలకు చెందిన వారే కావడం విశేషం. నియామక ఉత్తర్వులు పట్టుకుని రోజూ కేజీబీవీ, మోడల్ స్కూళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఆశలు.. ఆవిరి

శెట్టూరు మండలానికి చెందిన అంజినమ్మ శెట్టూరు కేజీబీవీ అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తు చేసుకుంది. ఎంపిక చేసిన అధికారులు ఈనెల 7న ఫోన్ చేశారు. ఇదేరోజు మధ్యాహ్నం 3 గంటలలోపు సమగ్రశిక్ష కార్యాలయానికి వచ్చి ఆర్డర్ కాపీ తీసుకోవాలని చెప్పారు. అంజినమ్మ తన భర్త సాయంతో అనంతపురం వచ్చి సమగ్రశిక్ష కార్యాలయంలో ఉత్తర్వులు తీసుకున్నారు. 8వ తేదీ ఉదయాన్నే వెళ్లి విధుల్లో చేరాలని చెప్పారు. ఆమెతోపాటు మరో ఐదు మందికి వివిధ పోస్టులకు నియామకాలు చేశారు. వీరిలో ఐదుగురు దళితులు, ఒక బీసీ మహిళ ఉంది. 8వ తేదీ నుంచి రోజూ తిప్పుకుంటున్న కేజీబీవీ ఉద్యోగులు.. చివరకు సోమవారం చేతులెత్తేశారు. సమగ్రశిక్ష కార్యాలయం నుంచి తమకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదని ఎస్ఓ స్పష్టం చేశారు. 'అక్కడి నుంచి మెయిల్ వస్తే జాయిన్ చేసుకుంటాం. అక్కడి నుంచి సమాచారం రాగానే...మీకు సమాచారం ఇస్తాం అప్పటిదాకా మీరు రావొద్దు' అని చెప్పి పంపారు. శెట్టూరు ఒక్కటే కాదు జిల్లాలోని 31 కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో ఇదే పరిస్థితి నెలకొంది. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఏ ఒక్కరినీ విధుల్లో చేర్చుకోలేదు.

67 మందికి నియామక ఉత్తర్వులు

కేజీబీవీలు, మోడల్ స్కూళ్లల్లో ఖాళీగా ఉన్న హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, డే-నైట్ వాచ్‌మెన్, చౌకీదారు, స్వీపరు, స్కావెంజర్ పోస్టులకు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేసేందుకు 67 మందిని ఎంపిక చేసి ఉత్తర్వులు ఇచ్చారు. గతంలో పని చేసిన అనుభావం, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకుని నిబంధనల మేరకే నియామకాలు జరిగాయి. తీరా విధుల్లో చేరేందుకు వెళ్లేసరికి అధికార పార్టీకి చెందిన చోటా నాయకులు ఎక్కడిక్కడ రాజకీయం చేశారు. దీంతో రంగంలోకి దిగిన ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు చేసినట్లు తెలిసింది. ఏ ఒక్కరినీ చేర్చుకోవద్దంటూ ఆదేశాలు రావడంతో తప్పనిపరిస్థితుల్లో అధికారులు హోల్డ్‌లో పెట్టారు. దీనిపై సమగ్రశిక్ష అధికారులతో మాట్లాడగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాత్కాలికంగా 'హోల్డ్'లో పెట్టామని చెబుతున్నారు. చిన్నచిన్న పనులు చేసుకుంటున్న తమ కడుపు కొడుతున్నారంటూ ఆయా పోస్టులకు ఎంపికైన దళిత, గిరిజన, బీసీ మహిళలు వాపోతున్నారు.

పొగమంచు ఎఫెక్ట్..

బత్తలపల్లి: పొగమంచు ప్రభావంతో రోడ్డు కనిపించక ఐషర్ వాహనం డివైడర్‌ను ఢీకొంది. గ్రామస్తులు తెలిపిన మేరకు... సోమవారం తెల్లవారుజామున కదిరి వైపు నుంచి అనంతపురం దిశగా వెళుతున్న ఐచర్ వాహనం కోడేకండ్ల వద్ద డివైడర్‌ను ఢీకొని కదిరి వైపు తిరిగి ఆగిపోయింది. అదే సమయంలో ఐచర్ వాహనం వెనుక ఏ వాహనాలు లేవు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఆ సమయంలో పొగ మంచు కారణంగా తనకేమీ కనిపించలేదని డ్రైవర్ తెలిపాడు.


ప్రమాదానికి గురైన ఐచర్ వాహనం

క్లుప్తంగా

రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం పాలకవర్గ సభ్యుడిగా శివశంకర్



అనంతపురం: రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం పాలకవర్గ సభ్యుడిగా అనంతపురానికి చెందిన సాకే శివశంకర్ నియమితులయ్యారు. ఆదివారం విశాఖపట్నంలో రాష్ట్ర హ్యాండ్ బాల్ సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం అధ్యక్షుడిగా యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ రాజు, కోశాధికారిగా డాక్టర్ రుద్రారెడ్డి ఎంపికయ్యారు. పాలకవర్గం సభ్యుడిగా సాకే శివశంకర్‌కు అవకాశం దక్కింది.

విజయ్‌కు డాక్టరేట్



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని జాగ్రఫీ విభాగంలో పరిశోధన చేసిన కే.విజయ్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ ఏ.కృష్ణకుమారి పర్యవేక్షణలో 'స్పేసియల్ అనాలసిస్ ఆఫ్ వర్కింగ్ పాపులేషన్ ఇన్ డ్రాట్‌ప్రోన్ అనంతపురం డిస్ట్రిక్ట్ విత్ స్పెషల్ రెఫరెన్స్ టు మున్సిపాలిటీస్' అనే అంశంపై పరిశోధన చేశారు. కరువు పీడిత ప్రాంతమైన అనంతపురం జిల్లాలోని మునిసిపాలిటీల్లో శ్రామిక జనాభా స్థితిగతులపై సమగ్రంగా అధ్యయనం చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురించారు.

చట్టాలపై అవగాహన అవసరం



వికలాంగుల హక్కులపై నాటిక ప్రదర్శిస్తున్న సొసైటీ సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: విభిన్న ప్రతిభావంతులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రతిభ సొసైటీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధిలోని వెంకటంపల్లి గ్రామంలో ప్రతిభా సొసైటీ ఆధ్వర్యంలో వికలాంగుల హక్కులు, చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వికలాంగులు అవసరమైన సమయంలో హక్కులను తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని సూచించారు. అలాగే మేనరిక వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు, సొసైటీ సభ్యులు, మిళిత సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు శ్రమించండి



మాట్లాడుతున్న డీఈఓ ప్రసాద్ బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రతి ఒక్కరూ కష్టం, ప్రతిభను నమ్ముకుంటే లక్ష్యాన్ని సాధించవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబు పేర్కొన్నారు. సోమవారం నగరంలోని తేజ అకాడమీలో ఉచిత డీఎస్సీ కోచింగ్ ప్రారంభమైంది. డీఈఓ ప్రసాద్ బాబు, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి (డీఎండబ్ల్యూఓ) రామసుబ్బారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై తరగతులను ప్రారంభించారు. పేద అభ్యర్థుల కోసం త్వరలోనే ఏపీ కానిస్టేబుల్ మెయిన్స్‌కు కూడా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు అకాడమీ డైరెక్టర్ జి.తేజేశ్వర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ చైర్‌పర్సన్ ఉమాదేవి పాల్గొన్నారు.

మహనీయుడు వేమన



మాట్లాడుతున్న రెక్టార్ జి.వెంకటనాయుడు

అనంతపురం: తెలుగు భాషకు ఖండాంతర ఖ్యాతి తెచ్చిన మహనీయుడు యోగి వేమన అని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకటనాయుడు అన్నారు. సోమవారం ఎస్కేయూలో యోగి వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగి వేమన చిత్రపటానికి నివాళులర్పించారు. రెక్టార్ మాట్లాడుతూ.. మూఢ నమ్మకాలపై చైతన్య బావుటా ఎగురవేసిన అభ్యుదయ ప్రజాకవి వేమన పద్యం తెలియని తెలుగు వారు ఉండబోరన్నారు. రిజిస్ట్రార్ రమేష్‌బాబు మాట్లాడుతూ.. చదువురాని వారు కూడా వేమన పద్యాలు అలవోకగా చెప్పే రీతిలో రచించారన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. తమిళనాడులో పెళ్లికి వేమన పద్యాలను కానుకగా ఇస్తారన్నారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కృష్ణకుమారి అధ్యక్షత వహించగా.. యోగి వేమన జయంతి కన్వీనర్‌గా ప్రొఫెసర్ ఎస్.ఆర్. సదాశివారెడ్డి వ్యవహరించారు.

జాతరకు వెళ్లొద్దామా..

ఆత్మకూరు, రాప్తాడు మండలాల పరిధిలోని వై.కొత్తపల్లి, మరూరు గ్రామాల్లో జాతర సందడి నెలకొంది. గ్రామస్తులు జాతరకు బంధువులను ఆహ్వానించడంతో సోమవారం పెద్ద ఎత్తున తరలివచ్చారు. సోమవారం అర్ధరాత్రి దున్నపోతులను బలి ఇచ్చారు. దున్నపోతును చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా వచ్చారు. మొక్కుబడి ఉన్న భక్తులు పొట్టేళ్లు, మేకలను పెద్దమ్మ, నల్లలమ్మ దేవతలకు బలి ఇచ్చారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేపట్టారు. జాతర సందర్భంగా తినుబండారాలు, గాజులు, బొమ్మల దుకాణాలు వెలిశాయి.



మరూరులో పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు

- నేడు వై.కొత్తపల్లి, మరూరులో పెద్దమ్మ, నల్లలమ్మ జాతర
- గ్రామంలో పండుగ వాతావరణం
- పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు

ఆత్మకూరు: జాతర అంటే గ్రామాల్లో ఓ ప్రత్యేకం .. జాతర చేస్తున్నారు అంటే ఆ గ్రామంలో ప్రతి ఇంట్లో మాంసం తప్పకుండా ఉండాల్సిందే. ఊరి దేవర నిర్వహించే గ్రామాల్లో ప్రతి ఇంటి వారు తమ బంధువులను తప్పకుండా ఆహ్వానించి, సంతోషంగా పండుగను జరుపుకుంటారు. మండలంలోని వై.కొత్తపల్లిలో మంగళవారం పెద్దమ్మ, నల్లలమ్మ జాతర జరగనుంది. ఆలయాలను రంగురంగుల విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. జాతరలో భాగంగా సోమవారం అర్ధరాత్రి దున్నపోతులను బలి ఇచ్చారు.

జాతర అంటేనే ఓ ప్రత్యేకం

సాధారణంగా ఊరి దేవర, (గాలి దేవర) అని రెండు రకాలు ఉంటాయి. శక్తి స్వరూపులైన గ్రామ దేవతలు (పెద్దమ్మ దేవత, నల్లలమ్మ దేవత, సుంకులమ్మ దేవత, మారెమ్మ దేవతలకు) పూజలు చేసి, దేవర నిర్వహిస్తారు. ఊరి దేవరకు సంబంధించి గ్రామంలో అమ్మవార్లకు బలి ఇచ్చే దున్నపోతు రక్తాన్ని పొలిమేరలో చల్లుతారు. దీంతో ఆ గ్రామానికి మంచి జరిగి పంటలు సమృద్ధిగా పండుతాయని గ్రామస్తుల నమ్మకం. దున్నపోతును బలి ఇచ్చిన తరువాత ఆ రక్తం దగ్గరికి సాధారణంగా వేరే గ్రామస్తులను రానివ్వరు. అంతేకాకుండా అర్ధరాత్రి అమ్మవార్లకు దున్నపోతును బలి ఇచ్చే వరకు గొర్రెలను, పొట్టేళ్లను, కోళ్లను కోయరు. దున్నపోతును బలి ఇచ్చిన తరువాతనే ఇతర మాంసాహార జంతువులను బలి ఇస్తారు. ముఖ్యంగా గ్రామంలో అమ్మ వార్లకు ముడుపు కట్టిన తరువాత గ్రామంలో మాంసాహారం తినకుండా జాతరలో దున్నపోతును బలి ఇచ్చిన తరువాతనే మాంసాహారం చేస్తారు.

28న పంపనూరులో..

మండల పరిధిలోని పంపనూరు గ్రామంలో ఈనెల 28వ తేదీన పెద్దమ్మ, ముత్యాలమ్మ దేవతల జాతర జరగనుంది. ఇప్పటి నుంచే ఆలయాల వద్ద నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నదానం చేయనున్నారు. అమ్మ వార్లకు పూజలు నిర్వహించి, జంతువులబలి ఇస్తారు.

50 ఏళ్ల అనంతరం మరూరులో..

రాప్తాడు: మండలంలోని మరూరు గ్రామంలో దాదాపు 50 ఏళ్ల అనంతరం పెద్దమ్మ, పోతులయ్య జాతర నిర్వహిస్తున్నారు. మంగళవారం జరగనున్న ఈ జాతరకు 30 వేల మంది వరకు జనాలు కలుస్తారని అంచనా. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. జాతరలో ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయాల కమిటీ సభ్యులు తెలిపారు.

జాతర ప్రశాంతంగా జరుపుకోండి

పెద్దమ్మ, పోతులయ్య జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు ప్రజలకు సూచించారు. సోమవారం ఆయన సీఐ శ్రీహర్షతో కలిసి గ్రామాన్ని సందర్శించారు. పెద్దమ్మ ఆలయం వద్ద గ్రామస్తులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జాతరలో ఏమైనా సమస్యలు తలెత్తితే పోలీసుల దృష్టికి తీసుకుని రావాలన్నారు. గొడవలకు దిగితే సహించేది లేదని హెచ్చరించారు. కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు.



విద్యుత్ వెలుగుల్లో వై.కొత్తపల్లిలోని పెద్దమ్మ దేవాలయం



మరూరులో పోతలయ్య స్వామి ఆలయాన్ని అలంకరించిన గ్రామస్తులు

అమ్మ వార్లకు ప్రత్యేకంగా పాదరక్షలు



నేను క్రిస్టియన్ అయినప్పటికి గ్రామ దేవతల మీద ఉన్న భక్తితో ఇలా గ్రామాల్లో గ్రామ దేవర్లు జరిగినప్పుడు చాలా సార్లు అమ్మవార్లకు పాదరక్షలు స్వాయంగా కుట్టి ఇస్తాను. దాదాపు 40 సంవత్సరాల నుంచి పాదరక్షలు కుట్టే పని చేస్తున్నాను. చాలా చోట్ల అన్ని అమ్మవార్లు, గ్రామ దేవతలకు ఇలా పాదరక్షలు ఉంచరు. పూర్వ కాలం నుంచి వచ్చే ఆచారాలతో ఉన్న అమ్మ వార్లకు మాత్రమే ఉంచుతారు. ఆ పాదరక్షలు కుట్టే సమయంలో ఎంతో నిష్ఠతగా ఉంటాను. అమ్మవార్లకు ఒక జత పాదరక్షలు కుట్టడానికి నాకు రెండు రోజుల సమయం పడుతుంది.

– దేవ సహాయం, ఆత్మకూరు

సంతోషంగా జరుపుకుంటాం



గ్రామంలో 50 ఏళ్ల తర్వాత పెద్దమ్మ జాతర జరుపుకోవడం సంతోషంగా ఉంది. ఏటా గ్రామంలో పెద్దమ్మ జాతర ఎంతో వైభవంగా జరిగేది. 50 ఏళ్ల క్రితం అనివార్య కారణాలతో ఆగిపోయింది. మళ్లీ పలుమార్లు జాతర నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినా వాయిదా పడుతూ వచ్చింది. ప్రస్తుతం అన్ని పార్టీల నాయకులు గ్రామంలో చిన్న కదిరయ్య స్వామి గుడి వద్ద కలిసి జాతర నిర్వహించేందుకు తీర్మానం చేయడం జరిగింది. సోమవారం రాత్రి 12 గంటల తర్వాత పెద్దమ్మకు దున్నపోతులను బలి ఇస్తాం.

– మాచిరెడ్డి కొండారెడ్డి, మరూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



సన్నప్పయ్యతో మాట్లాడుతున్న భూమిరెడ్డి మహానంది రెడ్డి

రాప్తాడు: అధైర్యపడొద్దు.. అండగా ఉంటామని ప్రసన్నాయపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు భూమిరెడ్డి మహానంది రెడ్డి అన్నారు. రాప్తాడుకు చెందిన బులగొండ సన్నప్పయ్య అనారోగ్యంతో అనంతపురంలో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న భూమిరెడ్డి మహానంది రెడ్డి.. సోమవారం ఆస్పత్రికి వెళ్లి సన్నప్పయ్యను పరామర్శించారు. కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దండు రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా



పతకాలను చూపుతున్న క్రీడాకారులు

అనంతపురం: ఈ నెల 11, 12 తేదీల్లో బాపట్ల జిల్లా రేపల్లెలో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న అనంతపురం జిల్లా క్రీడాకారులు 9 బంగారు, 2 రజతం, మూడు కాంస్య పతకాలు సాధించినట్లు తైక్వాండో కోచ్ మణీంద్ర తెలిపారు. భవేష్, తమన్, యస్వంత్, సుశాంత్, ఈశ్వర్ మోక్షిత్, కుశ్వంత్ రెడ్డి, ప్రణవి, హేమశ్రీ, సుగ్రా ఫాతిమా మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాలు కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. హర్షవర్ధన్ రెడ్డి, ఆశ్రత రజత పతకాలు, సాయి తన్వి, పూజ, జస్విన్ సాయి కాంస్య పతకాలు సాధించారన్నారు. విజేతలను తైక్వాండో రాష్ట్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, వెంకట్ అభినందించారు.

పార్టీ అభివృద్ధిపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: క్షేత్రస్థాయిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్మాణంపై మరింత దృష్టి సారించాలని ఆత్మకూరు, కనగానపల్లి మండలాల నాయకులకు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలోపేతంపై సోమవారం అనంతపురం నగర శివారులోని తన క్యాంపు కార్యాలయంలో దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరినీ గుర్తించి తగిన ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. అనుబంధ కమిటీలు బలమైన శక్తిగా తయారు కావాలన్నారు. అలివిగాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడు నెలల్లోనే హామీల అమలుపై చేతులెత్తేసిందన్నారు. జగనన్న హయాంలో ప్రతి ఇంటా సంక్షేమ పథకాలు అందాయన్నారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటిదాకా ఏ ఒక్క పథకమూ అమలు కాలేదని.. ఎక్కడికి పోయినా ప్రజలు చెబుతున్నారన్నారు. ఏడు నెలల్లోనే తిరుగుబాటు మొదలైందన్నారు. ప్రజల పక్షాన గొంతు వినిపించాల్సిన బాధ్యతపై మనపై ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా, అధినేత వైఎస్ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవడమే ధ్యేయంగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గంగుల భానుమతి, ఆత్మకూరు ఎంపీపీ హేమలత, యువజన, వలంటీర్ విభాగాల శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు గంగుల సుధీర్ రెడ్డి, ఓబుగారి హరినాథ రెడ్డి, ఆత్మకూరు, కనగానపల్లి మండలాల పార్టీ కన్వీనర్లు బాలపోతన్న, నాగమునెప్ప, పార్టీ జిల్లా కార్యదర్శి కురుబ వెంకటరాముడు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వేమన పద్యాల పోటీలు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని గంగినేపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పద్యాల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మెడల్స్ ప్రశంసాపత్రాలను సర్పంచ్ శాంతమ్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేమన ఫౌండేషన్ సభ్యులు అప్పిరెడ్డి హరినాథరెడ్డిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం వాణితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ తొలగించాలి

రాప్తాడు: మండలంలోని గొందిరెడ్డిపల్లి గ్రామంలో సీసీ రోడ్డుపై టీడీపీ నేత కుమ్మర నాగేంద్ర దౌర్జన్యంగా నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను తొలగించాలని కుమ్మరి నాగేంద్ర అన్న కుమారుడు కుమ్మర యల్లనూర్ అనిల్ కుమార్ కోరాడు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ బుల్లే విజయలక్ష్మికి వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ.. గొందిరెడ్డిపల్లి గ్రామంలోని బీసీ కాలనీలో 50 ఏళ్ల క్రితం మా తాతలు అయిన కుమ్మర వరాదప్ప, కుమ్మర నాగముని కుటుంబాలకు చెందిన వారు ప్రస్తుతం వాటర్ ప్లాంట్ నిర్మించిన స్థలంలో కుండలు తయారు (కుమ్మరి) చేసుకునే వాళ్లని తెలిపారు. గత 15 సంవత్సరాల నుంచి మా కుటుంబాల వారు కుండలు తయారు చేయడం లేదన్నారు. మా ఇళ్ల ముందు ఉన్న ఖాళీ స్థలంలో దాదాపుగా 10 కుటుంబాల వారు రాకపోకలు సాగించే వారని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో మా ఇళ్ల ముందు ఉన్న ఖాళీ స్థలంలో అప్పటి టీడీపీ నాయకులు మా ఇళ్ల వాకిళ్ల వరకు సీసీ రోడ్డు వేయించి బిల్లు చేయించుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం కుమ్మర నాగేంద్ర 20 అడుగులు సీసీ రోడ్డు కబ్జా చేసి సీసీ రోడ్డుపై ఎన్‌టీఆర్ సుజల స్రవంతి ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకున్నాడని తెలిపారు. సీసీ రోడ్డుపై వాటర్ ప్లాంట్ అడ్డంగా కట్టడంతో 10 కుటుంబాల వారికి రస్తా లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ కంఠం భూమిని అతడి భార్యపై రిజిస్ట్రేషన్ చేపించి, పంచాయతీ తీర్మానం కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. గ్రామస్తులందరూ వాటర్ ప్లాంట్‌ను తొలగించాలని కోరుకుంటున్నారని తెలిపారు. వాటర్ ప్లాంట్ పక్కనే ఇంటి నిర్మాణం చేస్తున్నారని.. తూర్పు వైపు 6 అడుగులు, ఉత్తరం వైపు 6 అడుగులు ముందుకు వచ్చిందన్నారు. వాటర్ ప్లాంట్‌తో పాటు ముందుకు వచ్చిన పోర్టికోను కూడా తొలగించాలన్నారు.



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న అనిల్ కుమార్

ఇళ్ల పట్టాలు మంజూరు చేసి ఆదుకోండి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పరిధిలోని వివిధ కాలనీల్లో ఏళ్ల తరబడి గుడిసెలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అనంతపురం రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సీపీఐ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. సోములదొడ్డి పంచాయతీ, కక్కలపల్లి పంచాయతీ ఐజీ నగర్, అక్కంపల్లి పంచాయతీ సదాశివనగర్ నివాసాలకు పట్టాలు మంజూరు చేయాలన్నారు. ఏళ్ల కిందట ఆయా కాలనీలు ఏర్పాటయ్యాయన్నారు. 2019 నుంచి ప్రభుత్వ భూమిలో నివాసం ఉంటున్న పేదలందరికీ ఇళ్ల స్థలాలు, పట్టాలు మంజూరు రెగ్యులర్ చేస్తామంటూ ఇటీవల కేబినేట్‌లో సీఎం చంద్రబాబు ప్రకటించారన్నారు. సీఎం ప్రకటన మేరకు వెంటనే ఆయా కాలనీలకు వెంటనే పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ యోగేంద్ర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ రాప్తాడు నియోజకవర్గ సహాయ కార్యదర్శి శ్రీకాంత్, రూరల్ మండల కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి నరేష్, నాయకులు అక్కులన్న,పాండు, విజయ్, కుళ్లాయప్ప, గోవిందు, వెంకటరాముడు, నరసింహులు, మహేష్, రామాంజనేయులు, తిరుపాలు నాయక్ పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు



తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

అనంతపురం రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. కూడేరు మండల పరిధిలోని పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు,, ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. కూడేరు మండలంలో ఎంతో మంది నిరుపేదలకు సొంత ఇళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెవెన్యూ అధికారులకు పలుమార్లు అర్జీలు ఇచ్చినా న్యాయం జరగలేదన్నారు. మండల పరిధిలో బ్రాహ్మణపల్లి చెరువుతో పాటు వివిధ గ్రామాల్లో చెరువులు, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. బ్రాహ్మణపల్లి చెరువును స్కంద రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించిన అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారని మండిపడ్డారు. అన్యాక్రాంతమైన చెరువు భూములతో పాటు ప్రభుత్వం భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు పక్కా ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు రాయుడు, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో న్యాయం

అనంతపురం ఎడ్యుకేషన్: 78 సంవత్సరాల స్వతంత్ర్య భారతదేశంలో నేటికీ షెడ్యూల్ కులాల మాదిగలు ఎదగకుండా అణచివేత, వివక్షతకు గురవుతున్నారని అనంతపురం రూరల్ మండల జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్ వాపోయారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలతో పోటీగా అన్ని రంగాల్లో భారతదేశం అభివృద్ధి చెందుతున్నా కూడా, షెడ్యూల్ కులాలను, మరీ ముఖ్యంగా మాదిగ కులం ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడ్డారన్నారు. రిజర్వేషన్లలో జనాభా ప్రాతిపదికన మాదిగలకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. ఎస్సీ కులాల వర్గీకరణతో ఉప కులాలన్నింటికీ న్యాయం జరుగుతుందన్నారు.

కమనీయం.. శ్రీవారి కల్యాణం



అలంకరణలో వేంకటేశ్వర స్వామి

అనంతపురం కల్చరల్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవం సోమవారం కనుల పండువగా సాగింది. స్థానిక ఆర్‌ఎఫ్ రోడ్డు లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం వేదికగా విష్ణుసహస్రనామ పారాయణ మండలి వారు కల్యాణం జరిపించారు. ఉదయం స్థానిక మొదటి రోడ్డు మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠం నుంచి ఉత్సవ విగ్రహాలను మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం ఆలయంలో తిరుమల తరహా సంప్రదాయంలో వేదపండితులు ఏఎల్ఎన్ శాస్త్రి బృందం ఎదుర్కోలు, తలంబ్రాలు, మాంగళ్యధారణ తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. మోక్ష ప్రాప్తిని కల్గించే సామూహిక విష్ణు సహస్రనామ పారాయణాన్ని ప్రారంభించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శ్రీవారి కల్యాణాన్ని జరిపించామన్నారు. మధ్యాహ్నం తీర్థప్రసాద వినియోగం అనంతరం అన్న సంతర్పణ జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి, విష్ణు సహస్రనామ పారాయణ మండలి నిర్వాహకులు మేడా వెంకటేశ్వర్లు, శ్రీరామమూర్తి, ఉపేంద్ర, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాత్రి వేళ పటిష్ట భద్రత చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

అనంతపురం: జిల్లా వ్యాప్తంగా రాత్రి వేళ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. రాత్రి వేళ సబ్ డివిజన్ల పరిధిల్లోని భద్రత కోసం నైట్ రౌండ్స్ అధికారులు నిరంతం బీట్ పాయింట్లను తనిఖీ చేస్తున్నారు. దేవాలయాలు, ప్రార్థన మందిరాలు, ఏటీఎం కేంద్రాలు, బ్యాంకులు ఇతర ముఖ్య వ్యాపార సముదాయాల వద్ద సిబ్బందిని అప్రమత్తం చేస్తూ విధుల్లో నిమగ్నమయ్యారు. నేరాల నియంత్రణ, అవాంఛనీయం సంఘటనలకు తావు లేకుండా ప్రత్యేక శ్రద్ధ చూపుతూ భద్రత చర్యలు చేపడుతున్నారు. అనుమానిత వ్యక్తుల వేలిముద్రలు సేకరించారు. సోమవారం నగరంలోని పలుచోట్ల వాహనాల తనిఖీలు చేపట్టారు.